
www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 12 మార్చి 2024
5
ఏలూరు



పశ్చిమ జెసి రామ్‌సుందర్‌రెడ్డి బదిలీ
కొత్త జెసిగా ప్రవీణ్ ఆదిత్య

ప్రజాశక్తి - భీమవరం


రామ్‌సుందర్‌రెడ్డి


ప్రవీణ్‌ఆదిత్య

జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కాకినాడ జాయింట్ కలెక్టర్‌గా పని చేస్తున్న ప్రవీణ్ ఆదిత్య నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. రామ్‌సుందర్‌రెడ్డి పశ్చిమగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా సుమారు సంవత్సర కాలం నుంచి పని చేస్తున్నారు.

'దాహం'తో దొంగాట..!

తాగునీటిపై వైసిపి, టిడిపి జిల్లా ప్రజానీకంతో దొంగాట ఆడుతున్నాయి. గుక్కెడు నీళ్లివ్వండి మహాప్రభో అంటున్న ప్రజానీకాన్ని ఇరుపార్టీలు తీవ్రంగా వంచించిన పరిస్థితి నెలకొంది. ఎన్నికల్లో ఓట్లు కోసం హామీలు గుప్పిస్తూ గెలిచిన తర్వాత తాగునీరు అందించేందుకు కనీస చర్యలు సైతం తీసుకోని పరిస్థితి నెలకొంది. వైసిపి, టిడిపి జిల్లా ప్రజానీకాన్ని మోసగించడంతో పదేళ్లుగా కలుషిత నీటినే జనం తాగడం.. లేక డబ్బులు వెచ్చించి తాగునీరు కొనుగోలు చేయడం తప్ప ప్రజలకు వేరే దిక్కులేకుండా పోయింది. జిల్లా ప్రజానీకం దాహం తీరుస్తామని వైసిపి, టిడిపి మోసం చేసిన తీరు అందరిలోనూ చర్చనీయాంశంగా మారింది.



తాగునీటి కోసం రెండు జిల్లాల ప్రజలు అగచాట్లు
ఆక్వా చెరువులతో తాగునీరు పూర్తిగా కలుషితం
2019 ఎన్నికల్లో వైసిపి చెప్పిన వాటర్‌గ్రిడ్ పథకం తూచ్
2014 ఎన్నికల్లో టిడిపి ఇచ్చిన హామీ బుట్టదాఖలే
జిల్లా ప్రజల దాహం కేకలు తీరెదెప్పుడంటూ ప్రశ్నిస్తున్న జనం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు రెండు లక్షల ఎకరాల్లో ఆక్వా సాగవుతోంది. నిబంధనలకు విరుద్ధంగా అడ్డగోలుగా చేపల చెరువుల తవ్వకాలు సాగించిన పరిస్థితి. చెడు వ్యర్థాలు, పురుగుమందు కలిసిన ఆక్వా చెరువుల్లో నీటిని పంటకాలువల్లోకి యథేచ్ఛగా వదిలేస్తున్నారు. దీంతో రెండు జిల్లాల్లో తాగునీటి వనరులన్నీ పూర్తిగా కలుషితమైపోయాయి. రెండు జిల్లాల్లో దాదాపు 35 లక్షలకుపైగా జనాభా తాగునీటి కోసం నానా ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా డెల్టా గ్రామాల్లో గుక్కెడు నీళ్ల కోసం జనాలు అల్లాడుతున్నారు. ప్రతి ఎన్నికల్లో తాగునీటి సమస్యపై ప్రధానంగా రాజకీయ పార్టీలు మాట్లాడుతున్నప్పటికీ గెలిచిన తర్వాత మాత్రం పక్కన పెట్టేస్తున్న పరిస్థితి ఉంది. 2019 ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే వాటర్‌గ్రిడ్ పథకం ఏర్పాటు చేసి గోదావరి నుంచి పైపులైన్ల ద్వారా తాగునీరు అందిస్తామని జగన్ జిల్లా ప్రజలకు హామీ ఇచ్చారు. పాదయాత్రలో భాగంగా ఈ నీళ్ల మనుషులు తాగుతారా అంటూ బాటిల్‌లో పోసిన నీరును బహిరంగ సభల్లో చూపించేవారు. అధికారంలోకొచ్చి ఐదేళ్లు పూర్తయిన ఇప్పటికీ వాటర్‌గ్రిడ్ పథకం అడుగు ముందుకు పడలేదు. అధికారంలోకివచ్చిన వెంటనే రూ.3,200 కోట్లతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో వాటర్‌గ్రిడ్ పథకం ఏర్పాటు చేస్తున్నట్లు హడావుడి చేశారు. తర్వాత డెల్టాప్రాంతానికి మాత్రమే పరిమితం చేస్తూ రూ.1400 కోట్లతో ప్రణాళికలు రచించినట్లు తెలిపారు. ఇప్పటి వరకూ ఏదీ జరగలేదు. ఇప్పటికీ కొనుగోలు చేస్తే తప్ప జిల్లా ప్రజానీకానికి దాహం తీరని పరిస్థితి కొనసాగుతూనే ఉంది. ప్రతిరోజూ తాగునీటి కోసం ప్రతి కుటుంబం రూ.20కు పైగా ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రతినెల పాలు బిల్లులా తాగునీటి కోసం డబ్బులు చెల్లించాల్సిన దుస్థితిలో జిల్లా ప్రజానీకం ఉన్నారు. 2014 ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే ప్రతి ఇంటికీ రోజుకు 20 లీటర్లు రక్షిత తాగునీరు ఉచితంగా అందిస్తామని టిడిపి చెప్పింది. అధికారంలోకి వచ్చాక చాలాకాలం ఆ మాటే మరిచిపోయింది. తీవ్ర విమర్శలు రావడంతో ఎన్‌టిఆర్ సుజల స్రవంతి తాగునీటి పథకం తెరపైకి తెచ్చింది. ఉండి, ద్వారకాతిరుమల వంటి మండలాల్లో కొన్ని పాత వాటర్‌ప్లాంట్లకు రంగులు వేసి హడావుడి చేయడం తప్ప తాగునీరు అందించలేదు.

ఈ ఎన్నికల్లో ఇంకేమి కబుర్లు చెబుతారో..?

వైసిపి, టిడిపి రెండు పార్టీలు తాగునీటిపై జిల్లా ప్రజానీకాన్ని మోసగించాయి. ఇచ్చిన హామీని రెండు పార్టీలూ నెరవేర్చలేదు. ఇప్పటికీ ప్రజలు తాగునీటి కోసం నానా ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఈ ఎన్నికల్లో తాగునీటిపై ఏం మోసపూరిత కబుర్లు చెబుతారోననే చర్చ జనాల్లో సాగుతోంది. తాగునీటి విషయంలో జిల్లా ప్రజానీకాన్ని రాజకీయ పార్టీలు మోసగిస్తున్న తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాగేందుకు గుక్కెడు నీటిని ప్రభుత్వాలు అందించలేకపోవడం అత్యంత దారుణంగా చెప్పొచ్చు. తాగునీటి సమస్యపై ఇరుపార్టీల మోసాలను చూసిన ప్రజలు ఈ ఎన్నికల్లో ఏ విధంగా స్పందిస్తారో వేచిచూడాలి.

ఎన్నికల బాండ్ల వివరాలు వెంటనే ప్రకటించాలి

ఎస్‌బిఐ బ్రాంచీల వద్ద సిపిఎం ధర్నాలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ



ఏలూరులో...



జంగారెడ్డిగూడెంలో..



నూజివీడులో...

సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఎన్నికల బాండ్ల వివరాలను వెంటనే వెల్లడించాలని కోరుతూ ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచి వద్ద సిపిఎం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సీనియర్ నేత బి.సోమయ్య అధ్యక్షత వహించగా ధర్నానుద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, నగర కార్యదర్శి పి.కిషోర్ మాట్లాడారు. బిజెపి నేతల ఒత్తిడికి తలొగ్గే ఎస్‌బిఐ బాండ్ల వివరాలు వెల్లడించడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో నేతలు కె.శ్రీనివాస్, పి.ఆదిశేసు, వైఎస్.కనకారావు, జె.గోపీ, ఎం.ఇస్సాక్, ఏసుబాబు, కోటేశ్వరరావు, ఆర్.నరసింహమూర్తి, వివివిఎన్.ప్రసాద్, బాలరాజు, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం టౌన్: ఎన్నికల బాండ్ల వివరాలను వెంటనే వెల్లడించాలని డిమాండ్ చేస్తూ ఎస్‌బిఐ బ్రాంచి వద్ద సిపిఎం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. తొలుత సిపిఎం కార్యాలయం నుంచి బుట్టాయగూడెం రోడ్డులోని బ్యాంకు వరకూ ర్యాలీ నిర్వహించారు. బ్యాంకు వద్ద ఆందోళనకు వంగా గోపీ అధ్యక్షత వహించగా సిపిఎం పట్టణ కన్వీనర్ పి.సూర్యారావు, మండల కార్యదర్శి ఎం.జీవరత్నం మాట్లాడారు. కార్యక్రమంలో నేతలు ఎస్‌కె.సుభాషిణి, షేక్ మహబూబ్ సుభాని, అందుగుల ప్రభాకర్‌రావు, జి.మణి, బి.గంగరాజు, డి.వెంకటేశ్వరరావు, ఎన్.భద్రం, కె.సునీల్ పాల్గొన్నారు.

ముసునూరు: ఎన్నికల బాండ్ల వివరాలు వెంటనే వెల్లడించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన స్థానిక ఎస్‌బిఐ బ్రాంచి వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు మాట్లాడారు. కార్యక్రమంలో కంచర్ల శ్రీనివాసరావు, తలకొండ సీతారాములు, కంచర్ల రంగారావు, కంచర్ల పోతురాజు, కంచర్ల సాంబయ్య, రెడ్డి తిరుపతిరావు, చిలీ, నక్కా నాగరాజు పాల్గొన్నారు.

నూజివీడు: స్థానిక ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచి వద్ద సిపిఎం ఆధ్వర్యాన సోమవారం ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి సిపిఎం నేతలు జి.రాజు, హనుమాన్‌లు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం తక్షణం ఎన్నికల బాండ్ల వివరాలను ఎస్‌బిఐ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రం అందజేశారు.

ఎసిబి వలలో ఎస్ఐ, రైటర్, హోంగార్డు

సినీఫక్కీలో పారిపోతున్న ఎస్ఐను ఛేజ్ చేసి పట్టుకున్న ఎసిబి అధికారులు


వివరాలు వెల్లడిస్తున్న ఎసిబి అధికారులు

ప్రజాశక్తి - నరసాపురం

సాధారణంగా పోలీసులు దొంగలను తరుముతారు.. అయితే యూనిఫామ్‌లో ఉన్న పోలీసు అధికారి మోటారు సైకిల్‌పై రయ్యిన దూసుకెళ్లిపోతుంటే.. మఫ్టీలో ఉన్న ఎసిబి అధికారులు ఛేజ్ చేసి పట్టుకున్న తీరు సినిమా షూటింగ్‌ను తలపించింది. ఇదీ నరసాపురం పట్టణంలో సోమవారం చోటుచేసుకున్న ఘటన. దీనికి సంబంధించి ఎసిబి ఇన్‌ఛార్జి డిఎస్‌పి శ్రీహరిరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

పట్టణ పోలీస్ స్టేషన్లో విజయవాడకు చెందిన బి.విజయ్‌సాగర్‌పై వరకట్నం వేధింపుల కేసు ఇటీవల నమోదైంది. అయితే ఈ కేసును మాఫీ చేసేందుకు పట్టణ ఎస్ఐ బిఎస్‌డిఆర్.ప్రసాద్ రూ.25 వేలు లంచం డిమాండ్ చేశారు. అయితే సాగర్ తన తండ్రి పోలీసు శాఖలోనే పని చేస్తున్నారని చెప్పినా లంచం ఇవ్వాల్సిందేనని ఎస్ఐ పట్టుబట్టారు. దీంతో సాగర్ ఎసిబి అధికారులను ఆశ్రయించారు. ముందస్తు వ్యూహం ప్రకారం సోమవారం లంచం సొమ్ము రూ.25 వేలు ఇచ్చేందుకు సాగర్ పోలీసు స్టేషన్ వద్దకు చేరుకున్నాడు. అయితే అక్కడొద్దని స్టేషన్ పక్కనే రోడ్డుపై జీపు ఆపి అక్కడకు రమ్మని ఎస్ఐ సాగర్‌కు చెప్పారు. సాగర్ అక్కడకు చేరుకుని సొమ్ము ఇవ్వబోతే జీపు డ్రైవర్ అయిన హోంగార్డు ప్రసాద్‌కు ఇవ్వాలని చెప్పారు. ఆ సమయంలో ఎస్ఐతోపాటు రైటర్ జోగి నాగేశ్వరరావు అక్కడే ఉన్నారు. డ్రైవర్ సొమ్ము సాగర్ వద్ద నుంచి తీసుకుని జీపులో పెడుతుండగా ఎసిబి అధికారులు దాడి చేశారు. ఇది గమనించిన ఎస్ఐ, రైటర్, జీపు డ్రైవర్ అక్కడ నుంచి పరారయ్యారు. అప్రమత్తమైన ఎసిబి అధికారులు రైటర్ నాగేశ్వరరావును పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ అటువైపు రోడ్డుపై మోటారు సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని లిఫ్ట్ అడిగి పాలకొల్లు రోడ్డు వైపు వెళ్లిపోయారు. ఎసిబి అధికారులు ఆయనను వెంబడించి మార్కెట్ యార్డు సమీపంలో పట్టుకున్నారు. ఎస్ఐ యూనిఫామ్‌లో ఉండటం, ఎసిబి అధికారులు సివిల్ డ్రెస్‌లో ఉండటంతో జనం ఏం జరుగుతుందా అని ఉత్కంఠగా చూశారు. తర్వాత ఎసిబి అధికారులని తెలియడంతో ఎస్ఐ తీరు చూసి ముక్కున వేలేసుకున్నారు. ఎస్ఐ, రైటర్‌ను అదుపులోకి తీసుకున్న ఎసిబి అధికారులు సోమవారం సాయంత్రం హోంగార్డును నరసాపురం పట్టణంలోనే అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురిని నరసాపురం టౌన్ పోలీసు స్టేషన్‌లో ఉంచి విచారిస్తున్నారు. అదే సమయంలో వీరు నివాసం ఉంటున్న గృహాల్లోనూ ఎసిబి అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల్లో ఎసిబి సిఐ ఎన్‌వి.భాస్కర్‌రావు, సతీష్, ఏలూరు, రాజమంత్రి కార్యాలయాలకు చెందిన సిబ్బంది పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

'స్పందన'లో 179 అర్జీలు స్వీకరణ

సంతృప్తికర రీతిలో అర్జీలు పరిష్కరించాలి
కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

'జగనన్నకు చెబుదాం-స్పందన' కార్యక్రమంలో అందిన దరఖాస్తులను ప్రజలకు సంతృప్తికర రీతిలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో జిల్లాస్థాయి జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు, ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలీ, డిప్యూటీ కలెక్టర్ భానుశ్రీతో అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందనకు 179 అర్జీలు అందాయన్నారు. ప్రజల నుండి అందే విజ్ఞప్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాత పరిష్కార విధానంపై ప్రజలు సంతృప్తి చెందని కారణంగా దరఖాస్తులు రీఓపెన్ అవతున్నాయన్నారు. స్పందన దరఖాస్తులు రీఓపెన్ కాని రీతిలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా అధికారులు, సిబ్బంది అర్జీదారులకు నాణ్యమైన పరిష్కార ఎండార్స్‌మెంట్ అందజేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఇ సర్వేను వేగవంతం చేయాలి: కలెక్టర్

జిల్లాలో ర్యాంప్ స్కీమ్ కింద చేపట్టిన మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్యూనర్స్ (ఎంఎంఎస్ఎంఇ) సర్వేను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. సోమవారం స్థానిక గోదావరి సమావేశ మందిరంలో ఎంఎస్ఎంఇ సర్వేపై సంబంధిత అధికారులు, ఎంపిడిఒలు, కమిషనర్లకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో తయారీ, సేవ, వాణిజ్యం రంగాలకు సంబంధించి 74 వేల సర్వీసులకు సర్వే చేసి వాటిని డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోకి తీసుకుని ఎంఎస్ఎంఇని అనుసంధానం చేయించాలన్నారు. జిల్లాలో ఇటీవల చేపట్టిన ఈ సర్వేలో భాగంగా ఇంతవరకు 1,590 పూర్తయిందని, మిగిలిన సర్వే ప్రక్రియను మూడు రోజుల్లో గణనీయమైన ప్రగతిలోకి తీసుకురావాలన్నారు. దీనిలో పంచాయతీరాజ్ ఎస్ఇ, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్‌తో సమన్వయం చేసుకోవాలన్నారు. దీనికోసం ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఎపిఇపిడిసిఎల్ ఎనర్జీ సెక్రటరీల సేవలను వినియోగించుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి మాట్లాడుతూ అందరికీ ఇళ్లకు సంబంధించి ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ డి.పుష్పమణి, ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలి, డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు, డిప్యూటీ కలెక్టర్ భానుశ్రీ పాల్గొన్నారు.

మహిళల ఉజ్వల భవిష్యత్తుకు 'వైఎస్ఆర్ చేయూత'


జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ

ప్రజాశక్తి - భీమడోలు


భీమడోలు : నమూనా చెక్కును అందిస్తున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ, ఎంఎల్ఎ వాసుబాబు

ఎంఎల్ఎ వాసుబాబు పలు అభివృద్ధి కార్యక్రమాలను శంకుస్థాపనతో సరిపెట్టకుండా వాటి నిర్మాణాలను పూర్తి చేసి ప్రముఖుల చేతులమీదుగా ప్రారంభోత్సవాలు చేయించడం అభినందనీయమని జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ అన్నారు. గుండుగొలను కేంద్రంగా సోమవారం మండలస్థాయిలో వైఎస్ఆర్ చేయూత నాలుగో విడత నిధుల విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ మాట్లాడుతూ వైఎస్ఆర్ చేయూత పథకం అక్కా చెల్లెళ్ల ఉజ్వల భవితకు సహకరిస్తుందని తెలిపారు. గ్రామ ఉపసర్పంచి, వైసిపి గ్రామ అధ్యక్షులు ముదుండి సూర్యనారాయణరాజు విజ్ఞప్తి మేరకు గుండుగొలను హైస్కూల్ ఆటస్థలం అభివృద్ధికి రూ.30 లక్షల జెడ్‌పి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎంఎల్ఎ వాసుబాబు మాట్లాడుతూ గ్రామ ఉపసర్పంచి విజ్ఞప్తి మేరకు గ్రామంలో నూతనంగా ఏర్పడిన జగనన్న కాలనీలో తాగునీటి ఎద్దడి శాశ్వత పరిష్కారానికి రూ.రెండు కోట్ల విలువైనరి జర్వాయర్ నిర్మాణానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచి సూర్యనారాయణరాజు, ఎంపిపి కనమాల రామయ్య, గ్రామ సచివాలయాల గ్రామస్థాయి కన్వీనర్ గౌటికల మురళి, మైనార్టీ కార్పొరేషన్ జిల్లా డైరెక్టర్ జహీర్, వైసిపి ప్రముఖులు రాయపాటి సత్యశ్రీనివాస్, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చింతలపూడి :వైఎస్ఆర్ చేయూత ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడం కోసం సిఎం జగన్ ఇప్పటికి నాలుగు విడతలుగా లబ్ధిదారులకు నేరుగా వారి ఖాతాల్లో సొమ్ము జమ చేశారని, ఇలాంటి వినూత్నమైన పథకం దేశంలో మరెక్కడా లేదని వైసిపి చింతలపూడి నియోజకవర్గ


చింతలపూడి : నమూనా చెక్కు అందిస్తున్న విజయరాజు

ఇన్‌ఛార్జి విజయరాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన నాలుగో విడత వైఎస్ఆర్ చేయూత కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో 5358 మందికి సంబంధించిన రూ.10,04,62,500 చెక్కు నమూనను మహిళలకు అందించారు. ప్రతి పేదవాడికీ నాణ్యమైన విద్య అందించే విధంగా సిఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. వైసిపి ప్రభుత్వం మహిళాభ్యున్నతికి పెద్దపీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు నీరజ, వైసిపి నాయకులు పొన్నాల అనితమ్మ, వైసిపి పట్టణ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, పట్టణ సచివాలయాల కన్వీనర్ నిమ్మగడ్డ దుర్గారావు, నాయకులు మిరియాల దిలీప్, గడ్డమడుగుల రాజేష్‌నాయుడు, గంధం చంటి పాల్గొన్నారు.

ప్రొటోకాల్ కచ్చితంగా పాటించాలి

ఎంఎల్ఎ ఎలిజా

చింతలపూడి : పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ కార్యక్రమాలు రెండు వేర్వేరు అని, ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజా ప్రతినిధి మాత్రమే నిర్వహించాలని, ప్రొ టోకాల్ కచ్చితంగా పాటించాలని చింతలపూడి ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో


మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఎలిజా

మాట్లాడుతూ వైఎస్ఆర్ చేయూత కార్యక్రమానికి వెళ్లేందుకు బయలుదేరానని, కానీ అనధికారిక వ్యక్తులు, స్టేజి పైన ఉండడంతో వెళ్లడం ఇష్టం లేక మానేశానని తెలిపారు. గతంలో ప్రొటోకాల్‌పై అధికారులపై జిల్లా కలెక్టర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. పార్టీ కార్యక్రమాలు ఇన్‌ఛార్జి చేసుకోవచ్చని, దానికి ఏ మాత్రం ఇబ్బంది లేదని, ప్రభుత్వ కార్యక్రమాలు మాత్రం ప్రజా ప్రతినిధి మాత్రం నిర్వహించాలని తెలిపారు.

ఇంటర్ పరీక్షల్లో మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లావ్యాప్తంగా సోమ వారం జరిగిన ద్వితీయ సంవత్సరం ఇంటర్ పరీక్షల్లో ఒక మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదైనట్లు ఏలూరు జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్ బి.ప్రభాకర్‌రావు తెలిపారు. ఏలూరు జిల్లాలో 51 కేంద్రాల్లో సోమవారం జరిగిన ద్వితీయ సంవత్సరం గణితం, జంతు శాస్త్రం, చరిత్ర పరీక్షకు మొత్తం 13,145 మందికిగాను 12,684 మంది హాజరయ్యారు. 460 మంది గైర్హాజరయ్యారు. వీరిలో సాధారణ విద్యార్థులు 11,277 మందికి 10,946 మంది హాజరయ్యారు. 330 మంది గైర్హాజరయ్యారు. వృత్తి విద్యావిభా గంలో 1,868 మందికి 1,738 మంది హాజరవ్వగా 130 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 97 శాతం హాజరు నమోదైంది. కలిదిండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జంతు శాస్త్రం సబ్జెక్ట్‌లో ఒక మాల్ ప్రాక్టీస్ కేసు బుక్ చేశారని, మిగిలిన కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ప్రభాకర్‌రావు తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

కలిదిండి : ఇంటర్ ద్వితీయ సంవత్సర మాథ్స్-2బి, హిస్టరీ, జువాలజీ పరీక్షకు 95 మంది హాజరైనట్లు ఎగ్జామినేషన్ చీఫ్ సూపరింటెండెంట్ నంబూరి గోపాలకృష్ణంరాజు తెలిపారు. మండలంలోని కోరుకొల్లు, కలిదిండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన పరీక్షకు 97 మంది విద్యార్థులకు 95 మంది హాజరయ్యారని ఆయన తెలిపారు.

30 మంది విద్యార్థులు గైరు హాజరు

నూజివీడు రూరల్ :పట్టణంలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం గణితం, జంతు శాస్త్రం, చరిత్ర సబ్జెక్టుల పరీక్షకు 30 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 1231 మంది విద్యార్థులకు 1201 మంది హాజరవ్వగా 30 మంది గైర్హాజరయ్యారు. తహశీల్దార్ ఎ.విశ్వనాథశాస్త్రి పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు.

కొల్లేటి పెద్దింట్లమ్మ జాతర ప్రారంభం


ప్రజాశక్తి - కైకలూరు


పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న నాయకులు

మండలంలోని కొల్లేటికోటలో ఉన్న శ్రీ పెద్దింట్లమ్మ జాతర ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు కుటుంబం, శాసనమండలి సభ్యులు జయమంగళ వెంకటరమణతో కలిసి ఈ జాతర ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గోపాలరావు, ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు వారికి సాదారంగా స్వాగతం పలికారు. అనంతరం ఎంఎల్ఎ, ఎంఎల్‌సి మాట్లాడుతూ యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా అన్ని వసతులు కల్పించారన్నారు. అనివేటి మండపాన్ని పూర్తి ప్రజా విరాళం, తన స్నేహితుల సహకారంతో నిర్మించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అడవి వెంకటకృష్ణమోహన్, జెడ్‌పిటిసి సభ్యులు కురేళ్ల బేబి, రాష్ట్ర నాయకులు సయ్యపురాజు గుర్రాజు, రాష్ట్ర బిసి నాయకులు ముంగర నరసింహారావు, పార్టీ మండలాధ్యక్షులు భట్రాజు శివాజీ, సర్పంచి ఫోరమ్ అధ్యక్షులు చెరుకువాడ బలరామరాజు, పెంచికలమర్రు సర్పంచి జయమంగళ కాసులు, పందిరిపల్లిగూడెం ఉప సర్పంచి మేడిశెట్టి మహేష్, ఆలయ ఛైర్మన్ పులవర్తి లక్ష్మణ్, ఆలయ కమిటీ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు గవర్నర్ నజీర్ ఏలూరు రాక

ప్రజాశక్తి - ఏలూరు



రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఈ నెల 12న ఏలూరులో పర్యటించనున్నారు. 12వ తేదీ మంగళవారం ఉదయం 8 గంటలకు విజయవాడ నుండి కారులో బయలుదేరి 9 గంటలకు ఏలూరు రైల్వే స్టేషన్‌కు చేరుకుంటారు. ఏలూరు రైల్వే స్టేషన్‌లో గూడ్స్‌షెడ్ ఆధునికీకరణ పనులకు ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్‌గా శంకుస్థాపన చేసే కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం ఉదయం 10.30 గంటలకు ఏలూరు నుండి కారులో బయలుదేరి 11.30 గంటలకు విజయవాడలోని రాజభవన్‌కు చేరుకుంటారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

రానున్న వేసవికాలంలో పట్టణ ప్రజలు తాగునీటి సమస్య ఎదుర్కోకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని మున్సిపల్ సమావేశంలో కౌన్సిల్ సభ్యులు అన్నారు. జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ సమస్యల గురించి కౌన్సిల్ సభ్యులు మాట్లాడారు. ప్రతిపాదిత పరిశుభ్రంగా ఉంచడం వల్ల ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉంటారన్నారు. డ్రెయినేజీ వ్యవస్థను సక్రమంగా ఉంచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు,ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సాధికారతే వైసిపి లక్ష్యం

ఎంఎల్‌సి జయమంగళ, ఎంఎల్‌ఎ డిఎన్‌ఆర్

ప్రజాశక్తి - కలిదిండి

మహిళా సాధికారతే వైసిపి లక్ష్యమని కైకలూరు ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. స్థానిక మార్కెట్ యార్డ్‌లో ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణతో కలిసి నాలుగో విడత వైఎస్‌ఆర్ చేయూత కార్యక్రమంలో పాల్గొని రూ.7.55 లక్షల నమూనా చెక్కును విడుదల చేశారు. ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు, జెడ్‌పిటిసి బొర్రా సత్యవతి, సర్పంచులు మసిముక్కు మారుతీప్రసన్న వెంకటేశ్వరరావు, సానా మీనా సరస్వతి రామారావు, బత్తిన ఉమామహేశ్వరరావు, ఎంపిటిసి సభ్యులు నీలి సుమన్, ఎఎంసి చైర్మన్ కొల్లాటి సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షులు వడుపు రామారావు, వైబిఎం సాంబశివరావు, ఎపిఎంలు, సిసిలు, వెలుగు మిత్ర సిబ్బంది, చేయూత మహిళా సభ్యులు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : పట్టణంలోని ఎస్‌ఆర్‌ఆర్ బాయ్స్ హైస్కూల్ ఆవరణలో సోమవారం వైఎస్‌ఆర్ చేయూత చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మేకా వెంకటప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ పట్టణంలో రూ.4.14 కోట్లు, రూరల్ మండలంలో రూ.9.58 కోట్ల చెక్కును మహిళలకు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం దయల రాజశేఖర్, అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : మహిళల జీవితాల్లో వెలుగులు నింపాలని, వారి ఆర్థిక పరిపుష్టిని పెంపొందించాలనే సదుద్దేశంతో సిఎం జగన్ వైఎస్‌ఆర్ చేయూత ప్రవేశపెట్టారని ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. వైఎస్‌ఆర్ చేయూత నాలుగో విడత వైఎస్‌ఆర్ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని 4433 మంది సభ్యులకు రూ.8.31 కోట్లను ఆయన పంపిణీ చేశారు. అనంతరం లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి జి.అనూష, జెడ్‌పిటిసి సభ్యులు పి.వీరబాబు, ఎంపిడిఒ పి.శ్యామ్యూల్, వైఎస్‌ఆర్ క్రాంతి పథం ఎసి వై. దుర్గావిజయకుమారి, ఎపిఎం బి.రామకృష్ణ, పార్టీ మండలాధ్యక్షులు పి.నరసింహరావు, నాయకులు ఎం.హరిబాబు, ఐవి.సుబ్బయ్య, పలు గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : ఎంపిడిఒ కార్యాలయంలో నాలుగో విడత వైఎస్‌ఆర్ చేయూత కార్యక్రమానికి సభ అధ్యక్షులుగా ఎంపిపి గంజిమాల రామారావు వ్యవహరించారు. ముఖ్య అతిథిగా ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తెల్లం రాజ్యలక్ష్మి మాట్లాడుతూ 3,938 మందికి రూ.7.38 కోట్ల చెక్కును అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు దాసరి శ్రీలక్ష్మి, ముప్పిడి విజయకుమారి, గంజిమాల దేవి, ఇళ్ల భాస్కరరావు పాల్గొన్నారు.

ఎఐటియుసి నాయకులు ప్రసాద్ మృతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మాజీ కోశాధికారి, ఎఐటియుసి నాయకులు అర్జీ ప్రసాద్ అనారోగ్యంతో సోమవారం ఏలూరులోని స్వగృహంలో మృతి చెందారు. ప్రసాదుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రసాద్ ఏలూరు పురపాలక సంఘంలో పబ్లిక్ హెల్త్ వర్కర్స్ యూనియన్ ఏర్పాటు చేసి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా, రాష్ట్ర నాయకులుగా అంచలంచెలుగా ఎదిగి మున్సిపల్ కార్మికుల సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించి ఎన్నో విజయాలను సాధించారని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మృతి ఎఐటియుసికి తీరని లోటన్నారు. ఓబులేసు ఫోన్ ద్వారా జిల్లా నాయకులతో మాట్లాడి ప్రసాద్ మృతికి తీవ్ర సంతాపం తెలిపారు. ప్రసాద్ మృతదేహాన్ని ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు బెద్ది శ్రీనివాసరావు, జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు, బికెఎంయు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు సందర్శించి నివాళులర్పించారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు భజంత్రి శ్రీనివాసరావు, ఎఐటియుసి, సిపిఐ ఉద్యోగ కర్మచారి సంఘాల నాయకులు సంతాపం తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఎఐటియుసి ఏలూరు ఏరియా అధ్యక్ష కార్యదర్శులు కె.కృష్ణమాచార్యులు, ఎ.అప్పలరాజు, కడుపు కన్నయ్య, సిపిఐ నాయకులు యర్రా వెంకటేశ్వర్లు, గేదెల నాగేశ్వరరావు, కనకం జగన్ సంతాపం తెలిపారు.

టైలర్స్ సేవా సంఘానికి సాయం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కొయ్యలగూడెం విలియం హెూం శ్రీ గణపతి రామా టైలర్స్ సేవా సంఘానికి టిడిపి పట్టణ అధ్యక్షులు జేష్ట రామకృష్ణారావు రూ.50 వేలు సోమవారం అందించారు. ఈ సందర్భంగా రామకృష్ణారావుకు టైలర్ సంఘ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టైలర్స్ సంఘ అధ్యక్షుడు తాడిగడప ఆంజనేయరాజు, గౌరవ అధ్యక్షులు రమణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి చెప్పుల మధుబాబు, కోశాధికారి పరస సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు సంకు కృష్ణ, టైలర్లు పాల్గొన్నారు.

నూజివీడు విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల హై స్కూల్ విద్యార్థినులు ప్రతిభ కనబర్చారని హెచ్ఎం వివిఎన్.సత్యనారాయణ తెలిపారు. రాష్ట్రస్థాయి కబడ్డీ రన్నర్స్, రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్‌లో విన్నర్‌గా నిలిచారన్నారు. చత్తీస్‌గఢ్ స్పోర్ట్స్ అకాడమీకి విద్యార్థిని ప్రభు దీపిక ఎంపికైందని, ఇద్దరి విద్యార్థినులకు కోరమండల్ కంపెనీ ఆర్థిక ప్రోత్సాహం లభించిందని తెలిపారు.

'జనసేనకు వ్యతిరేకం కాదు'

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

పొత్తు ధర్మంలో భాగంగా జనసేనకు తాము వ్యతిరేకం కాదని, ఒక వేళ జనసేనకు సీటు కేటాయించినా అధిష్టానం తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉంటామని, పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడిన వారిని సస్పెండ్ చేయాలని టిడిపి పట్టణ అధ్యక్షుడు రామకృష్ణారావు అన్నారు. ఆయన నివాసం వద్ద సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం నియోజవర్గంలో జనసేనకు సీటు కేటాయించడంపై వస్తున్న వార్తలపై ఆయన స్పందిస్తూ పోలవరం నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు నాయకత్వంలో అనేక కార్యక్రమాలు చేశామని, ఒక్కసారిగా వస్తున్న వార్తల నేపథ్యంలో కొంత నిరాశకు గురయ్యామన్నారు. ఇంకా నిర్ణయం వెలువడలేదని, అందరూ సమన్వయంగా ఉండాలని టిడిపి మండల కేడర్‌ను కోరారు.

ఆలయాభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని చింతలవల్లి శివారు గోగులంపాడు కొత్తూరులో ఉన్న రామాలయానికి చిర్రా బాలకృష్ణ రూ.పది వేలు అందించారు. ఖర్చుల నిమిత్తం, ఉసిరి చెట్టు పరిరక్షణ నిమిత్తం తన పుట్టిన రోజు సందర్భంగా బాలకృష్ణ తమ కుటుంబసభ్యులతో కలిసి రూ.పది వేలు ఆలయ కమిటీ సభ్యులకు అందించారు.

నేరాలు - ఘోరాలు

వృద్ధురాలిపై దాడి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

జంగారెడ్డిగూడెం పట్టణంలో రావులమ్మ చిలక వీధికి చెందిన సిఎన్‌ఆర్ థియేటర్ వద్ద నివాసం ఉంటున్న వృద్ధురాలు ఎం.దుర్గపై గుర్తు తెలియని వ్యక్తి కత్తితో దాడి చేశాడు. సోమవారం ఉదయం నిద్ర లేచి తలుపు తెరవగానే కత్తితో దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. గాయాలపాలైన ఆమెను కుటుంబసభ్యులు జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

స్పందన ఫిర్యాదుల సకాలంలో పరిష్కరించాలి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

ప్రజల నుంచి వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని ఆర్‌డిఒ భవానిశంకరి అధికారులను ఆదేశించారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్ణీత వ్యవధిలో ప్రజల సమస్యలను పరిష్కరించకపోతే సంబంధిత శాఖాధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

రైతుల సమస్యలను పరిష్కరించాలని టిడిపి నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పార్థసారథి సోమవారం స్పందన కార్యక్రమంలో ఆర్‌డిఒ భవానిశంకరికి వినతిపత్రం అందించారు. దీనిపై స్పందించిన ఆర్‌డిఒ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ఇళ్ల పట్టాలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

స్థానిక జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ పరిధిలోని ఎంబి సోషల్ క్లబ్‌లో లబ్ధిదారులకు రిజిస్టర్ చేసిన పట్టాలు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన లక్ష్మి మాట్లాడుతూ జగనన్న కాలనీలో ప్రజలకు కావాల్సిన అన్ని వసతులు సమకూర్చారన్నారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం పట్టణ అధ్యక్షులు చిటికెల అచ్యుతరామయ్య, వైస్ చైర్‌పర్సన్ కంచర్ల వాసవిరత్నం, వైస్ ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, జెట్టి గురునాధరావు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపిపి ఆరేపల్లి శిరీష అధ్యక్షతన సోమవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్ష చేశారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ కిరణ్‌కుమార్, హౌసింగ్ ఎఇ వెంకటేశ్వరరావు, డివైఇఒ సేవియా, ఎపిఒ సోమేశ్వరి, ఎంపిటిసిలు, సర్పంచులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోషకాహార లోపాన్ని నివారించాలి

ప్రజాశక్తి - మండవల్లి

గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో కనిపించే పోషకాహార లోపాన్ని నివారించడమే లక్ష్యంగా పోషకాహార పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నాగలక్ష్మి తెలిపారు. పోషణ అభియాన్‌లో భాగంగా సోమవారం మండవల్లి మండల కేంద్రంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించేందుకు, మాతా శిశు మరణాన్ని పూర్తిస్థాయిలో తగ్గించేందుకు అంగన్వాడీల ద్వారా బాలింతలకు, గర్భిణులకు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందిస్తుందన్నారు. అనంతరం పరిసరాల పరిశుభ్రత, చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు జయలక్ష్మి, శ్రీదేవి, ఉమాదేవి, సరస్వతి, సుధారాణి, నాగలక్ష్మి, వాలంటీర్లు, ఆశాలు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములకు పట్టాల పంపిణీ

ప్రజాశక్తి - ద్వారకా తిరుమల

మండలంలోని ఐఎస్.రాఘవాపురం రెవెన్యూ పరిధిలో జగన్నాధపురం పంచాయతీలో పేద రైతులకు అసైన్డ్ భూములకు మంత్రి తానేటి వనిత సోమవారం పట్టాలు పంపిణీ చేశారు. జగన్నాధపురంలో ఆర్‌ఎస్ నెంబర్ 425లో సుమారు 115 ఎకరాల ప్రభుత్వ భూమిని రైతులు ఎంతో కాలంగా సాగు చేసుకుంటూ పట్టాలు లేకపోవడంతో ప్రభుత్వం నుంచి వచ్చే ఎటువంటి లబ్ధి పొందలేకపోతున్నారు. మంత్రి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి తానేటి వనిత చొరవతో పట్టాలు వచ్చే విధంగా కృషి చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.కోటితో ఆలయ పునఃనిర్మాణ పనులు

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని గూటాలలో ఎండోమెంట్ సహకారంతో రూ.కోటి నిధులతో లక్ష్మి నరసింహస్వామి ఆలయ పున:నిర్మాణానికి వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తెల్లం రాజ్యలక్ష్మి సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఇటికలకోట గ్రామపంచాయతీ పరిధిలో వైఎస్‌ఆర్ హెల్త్ క్లినిక్ సెంటర్‌ను ప్రారంభించారు. మండల కేంద్రంలో వైఎస్‌ఆర్ క్రాంతి పథం మండల మహిళా సమాఖ్య కార్యాలయం ఆవరణలో వైఎస్‌ఆర్ చేయూత నాలుగో విడత కార్యక్రమం, ఖరీఫ్ 2023 వర్ష ప్రభావం వల్ల, మిచౌంగ్ తుపాను వల్ల పంట నష్టం జరిగిన రైతులకు ఇన్‌పుట్ రాయితీ కార్యక్రమం మండల వెలుగు ఎపిఎం బెజవాడ శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి కె.రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్‌ఆర్ చేయూత నాలుగో విడత కార్యక్రమంలో 2229 మందికి రూ.4,17,93,750 చెక్కును మహిళలకు, మిచౌంగ్ తుపాను వల్ల నష్టపోయిన రైతన్నలకు ఇన్‌పుట్ రాయితీ నియోజకవర్గంలో 6955 మంది రైతులకు రూ.5,63,50,525 చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, వైసిపి కన్వీనర్ బుగ్గ మురళీకృష్ణ, ఎపిడి ఎం.నాగేశ్వరరావు, ఎంపిడిఒ జి.శ్రీను, ఎస్ఐ ఎస్ఎస్.పవన్‌కుమార్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా లైటింగ్ పనులు చేస్తుండగా పాత పట్టిసీమ గ్రామానికి చెందిన పెంటపాటి హర్షకుమార్ విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైసిపి పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తెల్లం రాజ్యలక్ష్మి హర్ష కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. టిబిఆర్ ఫౌండేషన్ తరపున రూ.ఐదు వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆసరా సొమ్ములేవీ...సున్నా వడ్డీలేవీ

డ్వాక్రా సంఘాల మహిళల ఆవేదన

ప్రజాశక్తి - పోలవరం

వైఎస్‌ఆర్ ఆసరా పేరిట ఈ ఏడాది జనవరి 30, 31 తేదీల్లో ఆర్భాటంగా సిఎం జగన్ బటన్ నొక్కి ప్రారంభించిన ఆసరా సొమ్ములు పేరుకే ఖాతాల్లో ఉన్నా నేటికీ డ్వాక్రా సంఘాల మహిళలకు అందడం లేదని సోమవారం డ్వాక్రా మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఎఎంసి డైరెక్టర్ ఫాతిమా మున్నీసా బేగం మాట్లాడుతూ ఆసరా సొమ్ములు, సున్నా వడ్డీలు అంతర్గత అప్పులు లేవని డ్వాక్రా సంఘాల మహిళలు తమ వద్దకు వచ్చి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో స్టేట్ బ్యాంక్ మేనేజర్‌ని సంప్రదించి సంబంధిత వివరాలు తెలుసుకున్నామన్నారు. మండలంలో 1200 డ్వాక్రా సంఘాలున్నాయని వారికి ఆసరా సొమ్ముల విషయంలో వైఎస్‌ఆర్ క్రాంతి పథం తరపున జరగాల్సిన లావాదేవీలన్నీ పూర్తిచేసి అప్పగించినప్పటికీ వారికి ఆసరా సొమ్ములు పడలేదని, మరో రెండు రోజుల్లో వేస్తానని, సున్నా వడ్డీల విషయంలో ఎపిఎంని అడిగి తెలుసుకోవాలని మేనేజర్ తెలిపారన్నారు. స్త్రీ నిధి సొమ్ములు పొదుపు ఖాతాల్లో సంఘానికి రూ.రెండు నుంచి మూడు లక్షల వరకూ మినహా యిస్తున్నారని మండలంలో ఈ విధంగా మినహాయించిన సొమ్ములు రూ.కోట్లలో ఉన్నాయని, ఆ సొమ్ములను డ్వాక్రా మహిళలకు అంతర్గత అప్పులుగా ఇవ్వాలని డిఆర్‌డిఎ సూచించినా కనీసం సర్క్యులర్ కూడా చూపకుండా అప్పులు ఇవ్వడం లేదన్నారు. ఆసరా సొమ్ములు ఖాతాల్లో జమ అయినప్పటికీ తీసుకోవడానికి లేకుండా పోయిందని, ఖాతాలకు జమ అయిన సొమ్ములు వెంటనే ఇప్పించాలని సుమారు 30 గ్రూపుల డ్వాక్రా సంఘాల మహిళలు కోరారు.

నివాస భూములకు హక్కులు కల్పించాలని ధర్నా

ప్రజాశక్తి - నిడమర్రు


తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

పత్తేపురం నివాస భూములకు హక్కులు కల్పించాలని సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణరావు కోరారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయం వద్ద పత్తేపురం వాసులు, సిపిఎం నాయకులు సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ మండలంలోని పత్తేపురంలో గత 70 ఏళ్లగా ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకుని ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నామని ఆ ప్రాంతవాసులు తెలిపారు. 2020లో సామాన్యులకు తెలియకుండా వారి ప్రమేయం లేకుండా ఇళ్ల స్థలాలను ఓ అజ్ఞాత వ్యక్తి ఖాదీ బండారి చిన్న పరిశ్రమల పేరుతో తనఖాలో పెట్టి వాడుకున్నారన్నారు. ఆ వ్యక్తి ఆ డబ్బులు కట్టకపోవడంతో స్థలాలను, ఇళ్లను గణపవరం సబ్ రిజిస్టర్ కార్యాలయం బ్లాక్ లిస్టులో పెట్టారన్నారు. రమణరావు మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు స్పందించి భూములపై నిషేధం ఎత్తివేసి హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే పోరాటం ముందుకు తీసుకెళ్తామని హెచ్చరించారు. అనంతరం స్పందన కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.వరలక్ష్మి, పి.పద్మావతి, సుబ్బరాజు, వెంకటరాజు, వెంకట సుబ్బమ్మ, సిపిఎం నాయకులు కోన శ్రీనివాసరావు, కానూరు రాజు, లావేటి సోంబాబు, వెలగలేటి మోహన పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతి


ఎస్‌పికి వినతిపత్రం అందిస్తున్న ఫెడరేషన్ సభ్యులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) ఇచ్చిన రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జబీర్, వైవి.హరీష్, రాష్ట్ర నాయకులు బాలశౌరి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో జర్నలిస్టులకు మూడు సెంట్ల ఇంటిస్థలం కేటాయింపు వెంటనే జరిగేందుకు వీలైన చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో కమిటీలు ఇప్పటికే జాబితాలను తయారు చేశారని, ఫిబ్రవరిలో మరోవారం రోజులు దరఖాస్తుకు అవకాశం కల్పించడం ద్వారా మరికొందరు జర్నలిస్టులు కూడా దరఖాస్తు చేశారని, తుది జాబితాను తయారు చేసి వెంటనే ఆ జాబితా విడుదల చేయాలని కోరారు. జాబితాలోని జర్నలిస్టులకు ఆయా మండలాల్లో, జిల్లా కేంద్రంలో ఎంతభూమి అవసరమో అంచనాలు తయారుచేసి అందుబాటులో ఉన్న భూమి వివరాలను సేకరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే భూమి అందుబాటు ఉన్న ప్రాంతాల్లో ధర నిర్ణయం జరిగి జర్నలిస్టులు ఎంతమొత్తం, ఎప్పటిలోగా చెల్లించాలో కమిటీలు నిర్ణయిస్తే అందుకు అనుగుణంగా జర్నలిస్టులు సంసిద్ధులవుతారని, జర్నలిస్టులంతా ఆర్థికంగా బలహీనస్థితిలో ఉన్నవారని, కనుక తగినంత సమయం ఇస్తే బాగుంటుందని తెలిపారు. అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరుతూ అడిషనల్ ఎస్‌పికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎపిడబ్ల్యూజెఎఫ్ దెందులూరు నియోజకవర్గం అధ్యక్షులు రుషిరావు, సత్యనారాయణ, శ్రీనివాస్, కళ్యాణ్, వాసు, పౌల్‌రాజ్, సోమశేఖర్, నారాయణ, బాబ్జి, సతీష్ పాల్గొన్నారు.

గుండుగొలను-కోరుకొల్లు రోడ్డు పునఃనిర్మాణం

రూ.2 కోట్ల అంచనా వ్యయంతో శంకుస్థాపన చేసిన ఎంఎల్‌ఎ వాసుబాబు


రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్‌ఎ

భీమడోలు: గుండుగొలను–కోరుకొల్లు రహదారి మీదుగా ప్రయాణించే వారి ఇబ్బందులు తొలగనున్నాయి. రూ.రెండు కోట్ల అంచనా వ్యయంతో రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో రోడ్డు పున:నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఈ కార్యక్రమానికి ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొల్లేరు సరస్సు ఆవాస ప్రాంతాల్లో కోరుకొల్లు గ్రామానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. ఆ ప్రాంతంలో ఆక్వా సాగు మాత్రమే జరుగుతుందని, ఇదే అక్కడి ప్రజల జీవనాధార మని తెలిపారు. ఈ నేపథ్యంలో సుమారు 20 టన్నులు, అంతకు మించిన బరువుతో చేపల ఎగుమతులు, మేతల దిగుబడులు జరుగుతుంటాయన్నారు. గతంలో ఈ రోడ్డు పంచాయతీరాజ్ శాఖ అధీనంలో ఉండేదన్నారు. ఆ రోడ్డుపై చేపల లోడులతో ఎక్కువ సంఖ్యలో రవాణా వాహనాలు ప్రయాణం చేసేవన్నారు. అక్కడి భూ స్వభావం కారణంగా ఆ రోడ్డుకు ఎక్కువగా మరమ్మతులు వచ్చేవన్నారు. నిధుల కొరత, ఇతర కారణాలవల్ల రోడ్డుకు మరమ్మతులు జరగక ఆ రోడ్డును బాగు చేసే పరిస్థితి ఉండేది కాదన్నారు. ఈ నేపథ్యంలో స్థానికుల విజ్ఞప్తి మేరకు ఆ రోడ్డును పంచాయతీ రాజ్ శాఖ నుంచి రోడ్లు భవనాల శాఖకు బదలాయించామన్నారు. దీంతో ఆ శాఖ ఆ రోడ్డు పరిస్థితి అంచనా వేసి రోడ్డు పటిష్టంగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుందన్నారు. దీంతో గుండుగొలను–కోరుకొల్లు మధ్య ఉన్న 3.60 కిలోమీటర్ల పొడవున రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయింపు చేశామన్నారు. అధిక సామర్థ్యంతో తిరిగే రవాణా వాహనాల రాకపోకలను దృష్టిలో ఉంచుకొని రెండు వాహనాలు తేలికగా తప్పుకునే విధంగా 3.66 మీటర్ల వెడల్పుతో రోడ్డు నిర్మాణాన్ని చేపట్టే కార్యక్రమానికి శంకుస్థాపన చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో గుండుగొలను గ్రామ ఉపసర్పంచి ముదుండి సూర్యనారాయణరాజు, ఎఎంసి చైర్‌పర్సన్ ఇంజేటి నీలిమ జూనియర్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

గిరిజన రైతులకు పనిముట్లు పంపిణీ

జీలుగుమిల్లి : మండలంలోని కేంద్రీయ పొగాకు పరిశోధన కేంద్రం (సిటిఆర్ఐ)లో గిరిజన ఉప ప్రణాళిక పథకం కింద పలువురు గిరిజన రైతులకు స్ప్రేయర్లు, వ్యవసాయ యాంత్రిక పనిముట్లను అందించినట్లు సిటిఆర్ఐ హెడ్ వైవి.సుబ్బయ్య తెలిపారు. ఈ సందర్భంగా వాణిజ్య పంటల్లో తీసుకోవాల్సిన సమగ్ర సస్య రక్షణ చర్యలు, పురుగు మందుల వాడకంలో తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం పురుగు మందుల పిచికారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు టి.పావని, వెంకటేష్, ఫామ్ మేనేజర్లు టి.వెంకటేష్, రమేష్, ప్రభు, సిటిఆర్ఐ సిబ్బంది పాల్గొన్నారు.

తాపీ పనివార్ల సంఘం అధ్యక్షునిగా సోమరాజు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలుకు చెందిన అయ్యప్ప తాపీ పనివారల సంఘం నూతన అధ్యక్షుడిగా కేతినీడి సోమరాజు ఎన్నికయ్యారు. సంఘ సర్వసభ్య సమావేశం ఆదివారం సాయంత్రం భీమడోలులో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఏకగ్రీవంగా జరిగిన ఎంపికలో ఇప్పటివరకు సంఘ అధ్యక్షులుగా కొనసాగిన కోటిపల్లి సీతారామయ్య గౌరవాధ్యక్షులుగా కొనసాగమన్నారు. వీరితో పాటు సంఘ కార్యదర్శిగా ఈతకోట తాతాజీ, సంయుక్త కార్యదర్శిగా షేక్ నాగుర్, కోశాధికారిగా ఈతకోట వీర రాఘవులతో పాటు మరొక ఐదుగురు కార్యవర్గ సభ్యులుగా ఎంపికయ్యారు. నూతన కార్యవర్గాన్ని సంఘ ఇతర సభ్యులు అభినందించారు.

రోడ్డుపైకి డ్రెయినేజీ నీరు

స్థానికుల ఇబ్బందులు.. పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - చింతలపూడి

పట్టణంలోని కొప్పులవారి వీధిలో డ్రెయినేజీలు పొంగి రోడ్డు మీదకు వస్తున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రెయినేజీ శుభ్రం చేయడంలేదని వాపోతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రెయినేజీలు శుభ్రం చేసి రోడ్డు మీదకు నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


రోడ్డుపై డ్రెయినేజీ నీరు

తాగునీటి పైపులైన్లు ఏర్పాటు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని మీర్జాపురం గ్రామపంచాయతీ పరిధిలోని కండ్రిక గొల్లగూడెం ప్రాంతానికి చెందిన ప్రధాన రహదారి వెంబడి తాగునీటి పైపులైన్లను అధికారులు సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ ప్రాంతానికి గత 12 ఏళ్లుగా తాగునీటి సౌకర్యం లేదని, నేడు పైపులైన్లతో నీటిని అందించడం ఆనందంగా ఉందని తెలిపారు. అనంతరం సర్పంచికి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

వంద పడకల ఆసుపత్రి సందర్శన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

పట్టణంలోని వంద పడకల ఆసుపత్రిని వైసిపి నాయకులు జెట్టి గురునాథరావు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు మెరుగైన చికిత్స అందించాలన్నారు. ఆయనతో పాటు ఉభయగోదావరి జిల్లా బూత్ కమిటీ రీజనల్ కో–ఆర్డినేటర్ బివిఆర్.చౌదరి, వైస్ ఛైర్మన్లు ముప్పిడి వీరాంజనేయులు, కంచర్ల వాసవి, స్థానిక కౌన్సిలర్ నేట్రు సుబ్బలక్ష్మి, కౌన్సిలర్లు ఉగ్గం దుర్గాప్రసాద్, నీకూరి కిషోర్ ఉన్నారు.

'సీటు ఎవరికిచ్చినా గెలిపించాలి'

ప్రజాశక్తి - టి.నరసాపురం

రాష్ట్రంలో టిడిపి, జనసేన, బిజెపి ఎన్నికల పొత్తులో భాగంగా పొత్తు ధర్మం పాటించి సీటు ఎవరికిచ్చినా గెలిపించాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి జయ్యవరపు శ్రీరామమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. పొత్తులో త్యాగాలు తప్పవన్నారు. నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు.

హుండీ ఆదాయం రూ.14.47 లక్షలు

ప్రజాశక్తి - ముసునూరు

బలివేలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ మహాశివరాత్రి ఉత్సవాల హుండీని కార్యనిర్వహణ అధికారి నల్లూరి సతీష్ కుమార్, ఛైర్మన్ నాగుల నాగేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ అధికారుల ఆధ్వర్యంలో సోమవారం లెక్కించారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ ఈ నెల 7, 8, 9, 10వ తేదీల్లో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా హుండీ ఆదాయం రూ.14,47,371 వచ్చినట్లు ఆయన తెలిపారు.

పాతాళ భోగేశ్వరుని ఆదాయం..

కలిదిండి : స్థానిక శ్రీ పాతాళ భోగేశ్వర స్వామి మహాశివరాత్రి మహోత్సవంలో ఆదాయం లెక్కించగా రూ.25,89,979 వచ్చినట్లు ఆలయ ఇఒ శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఏలూరు జిల్లా ఉత్సవాల ప్రత్యేకాధికారి సుధాకర్, ఆలయ ధర్మకర్తల మండలి సమక్షంలో లెక్కింపు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

'మాట తప్పి మడమ తిప్పిన జగన్'

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

మద్య నిషేధం చేశాకే ఓటు అడుగుతానని మాట తప్పి మడమ తిప్పిన జగన్‌కు ఓటు అడిగే హక్కు లేదని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్ర శేషు అన్నారు. జంగారెడ్డిగూడెంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాసిరకం మద్యంతో 35 లక్షల మంది ఆరోగ్యాలు నాశనం చేశాడని చెప్పారు. నాసిరకం మద్యం వల్ల కిడ్నీ, లివర్ చెడిపోయి 30 వేల మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. 2.32 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తానని చెప్పి మాట తప్పారన్నారు. టిడిపి రాష్ట్ర మహిళా కార్యనిర్వాహక కార్యదర్శి పగడం సౌభాగ్యవతి, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి చిట్టిబొయిన రామలింగేశ్వరరావు, రాష్ట్ర ఎస్‌సి సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పాతూరి అంబేద్కర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి నియోజకవర్గ మీడియా కో–ఆర్డినేటర్ చెరుకూరి శ్రీధర్, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి చిత్తపురి దుర్గేష్, ఎస్‌సి సెల్ అధికార ప్రతినిధి తాళ్లూరి వెంకటేశ్వరరావు, నియోజకవర్గ టిఎన్ఎస్ఎఫ్ ఉపాధ్యక్షుడు పులపాకుల ప్రసాద్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి, ఏలూరు (సీనియర్ డివిజన్)

ఐ.ఎ. నెం. 961/2022
యఫ్.డి.ఐ.ఎ. నెం. 374/2011
ఒ.యస్. నెం. 57/2001

బిట్వీన్:
రాజాన చంద్రవతి -పిటీషనర్/వాది
మరియు
పట్నాల అచ్చయమ్మ (died) and వగయిరాలు -రెస్పాండెంట్స్

పిటీషనరు దాఖలు చేసిన పబ్లికేషన్

పై నంబరు గల పిటీషన్‌లో 12వ రెస్పాండెంటు అయిన 12. కోడూరి అన్నవరం, S/o. లేటు వెంకటేశ్వరరావు, కురెళ్ళగూడెం, భీమడోలు మండలం, ఏలూరు జిల్లా వారికి పై నంబరు గల పిటీషన్‌లో ది. **25-3-2024వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** స్వయంగా గాని, లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరయి తమ ఆక్షేపణలు తెలియపర్చుకొనవచ్చును. లేని ఎడల సదరు పిటీషన్ ఏకపక్షముగా తీర్మానము చేయుదురని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

ఆవుల జగన్మోహనరావు
పుప్పాల రామకృష్ణ
అడ్వకేట్స్, శ్రీరామ నివాస్
అశోక్‌నగర్, ఏలూరు

ఏలూరు
ది.10-3-24